క్లుప్తంగా

వృద్ధులకు పండ్లు పంపిణీ



గుడివాడటౌన్: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక కరుణాపీఠం వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, భోజనం పంపిణీ చేశారు. సేవా సంఘం సభ్యులు రేవంత్ సత్యశివరామ్ యాదవ్ వితరణతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సేవాసంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్ అన్నారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య ప్రముఖులు బొగ్గరపు తిరుపతయ్య, లయన్స్‌క్లబ్ రీజనల్ చైర్మన్ వైవీ కృష్ణారావు, ఆర్‌కే ఫౌండేషన్ అధ్యక్షుడు కె.రామకృష్ణ, శ్రీరామ్ యాదవ్, వంశీ, భవాని తదితరులు పాల్గొన్నారు.

వార్డు వలంటీర్ల సేవలు అభినందనీయం



గుడివాడటౌన్: ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో వార్డు వలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయం అని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. స్థానిక ముగ్గు బజార్ సచివాలయం ప్రాంగణంలో శనివారం పట్టణానికి చెందిన 6, 7, 8, 9, 10, 11 వార్డుల వలంటీర్లకు సత్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రారంభించి అమలు చేస్తుంటే వాటన్నింటికి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి పథకాల ఫలాలను చేరవేయడంలో వీరి పాత్ర ఎంతో గొప్పదన్నారు. వీరి సేవలను గుర్తించి ప్రభుత్వం సత్కరిస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, దుడ్డు చిన్నా, నాగేశ్వరరావు, వెంపల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు, ఇళ్ల పట్టాలు



గుడివాడటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లులేని ప్రతి ఒక్కరికీ గృహ వసతి కల్పిస్తుందని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. టిడ్కో ఇళ్ల మంజూరు విషయంలో తమ పేర్లు తొలగించారని, వాటి పరిష్కారానికి మార్గం సుగమం చెయ్యాలని కొందరు మహిళలు ఆయనకు విజ్ఞప్తి చేయగా, దానిపై స్పందిస్తూ ఇళ్ల కేటాయింపులో ఏ విధమైన భేదాభిప్రాయాలు లేవన్నారు. సాంకేతిక ఇబ్బందులు ఉంటే వాటిని ఎప్పటికప్పుడు తొలగించి లబ్ధిదారులకు ఇళ్లు కేటాయిస్తున్నామన్నారు. సంబంధిత వార్డు సచివాలయాల్లో సంప్రదిస్తే సమస్యకు పరిష్కారం చూపుతారన్నారు. పేదలకు అందజేసేందుకు మల్లాయిపాలెం లే-అవుట్‌లో ఇంకా ఇళ్ల స్థలాలు ఖాళీగా ఉన్నాయని, అన్ని అర్హతలు ఉండి దరఖాస్తు చేసుకుంటే తప్పక కేటాయిస్తామని చెప్పారు.

విద్యార్థులకు మహాభారతం బోధన

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు శనివారం మహాభారతాన్ని బోధించారు. రిటైర్డ్ లైబ్రేరియన్ అవిరినేని వెంకటేశ్వరరావు భారతంలోని శ్రీకృష్ణరాయబార ఘట్టాన్ని పద్యాలతో సహా వివరించారు. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు గురించి లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి వివరించారు. ఉపాధ్యాయుడు జి.బాబూరావు, ఇంగ్లిషు బోధించారు. ఇండోర్ గేమ్స్ ఆడించారు.

అదుపు తప్పిన కారు నలుగురికి గాయాలు

ఉంగుటూరు(ఏలూరు జిల్లా): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అయినవిల్లిలో దైవ దర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా మార్గ మధ్యంలో జాతీయ రహదారిపై ఏలూరు జిల్లా నాచుగుంట వద్ద కారు అదుపుతప్పిన ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి...అయినవిల్లి నుంచి గుడివాడ వెళుతున్న కారు నాచుగుంట రేవు సమీపించేసరికి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న తమ్మన రాజేష్ (డ్రైవర్), అతడి తల్లి నాగలక్ష్మి, నతుకుల ఉపేంద్ర అతని తండ్రి సుబ్బారావుకు గాయాలయ్యాయి. వీరిని హైవే అంబులెన్సులో తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరితో పాటు మరో చిన్నారి, మహిళ కారులో ఉన్నా వారికి ఎటువంటి గాయాలు కాలేదు. వీరంతా గుడివాడ, నూజివీడు ప్రాంతాల నుంచి అయినవిల్లికి దైవ దర్శనానికి వెళ్లారు. డ్రైవర్ కునికిపాట్లు పడటంతోనే ప్రమాదం జరిగిందని తెలిసింది. చేబ్రోలు ఎస్‌ఐ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సేవకు ప్రతిరూపం వలంటీర్లు

- ఎమ్మెల్యే డీఎన్నార్
- కలిదిండి మండలంలో వలంటీర్లకు సన్మానం



కలిదిండి ఏఎంసీ కార్యాలయం వద్ద వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

కైకలూరు: సేవకు ప్రతిరూపంగా గ్రామాల్లో వలంటీర్లు నిలుస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా కలిదిండి ఏఎంసీ కార్యాలయ ఆవరణలో శనివారం కలిదిండి మండలంలో ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా వలంటీర్లు పనిచేస్తున్నారన్నారు. మండలంలో సేవా వజ్ర అవార్డుకు కట్టా వెంకన్నబాబు (చినతాడినాడ), సేవా రత్న అవార్డులకు సిరింగి పాల్‌రాణి (కోరుకొల్లు), గాడి అంతర్వేది (సంతోషపురం), కట్టా వెంకట నాగరాజు (పోతుమర్రు), తిరుమాని కుమారి(చినతాడినాడ), రామల్లి దివ్య (కొండంగి)లను సత్కరించారు. మరో 274 మంది వలంటీర్లకు సేవా మిత్ర అవార్డులు అందించారు. సేవా వజ్రలకు రూ.30 వేలు, సేవా రత్నలకు రూ.20 వేలు, సేవా మిత్రలకు రూ.10 వేలు చొప్పున నగదు జమతో పాటు, సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జి, మెడల్ అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, ఏఎంసీ చైర్మన్ ఐనాల బ్రహ్మాజీరావు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, సర్పంచ్ మసిముక్కు మారుతి ప్రసన్న, వైస్ ఎంపీపీలు కూసంపూడి కనకదుర్గరాణి, కట్టా నాగలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు తిరుమాని రమేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవికుమార్, ఏలూరు జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ చాన్ బాషా, ఎంపీడీఓ శ్రవణ్‌కుమార్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, పీఏసీఎస్ అధ్యక్షులు, వివిధ గ్రామాల పార్టీ నాయకులు హాజరయ్యారు.

ఎస్సీ కమ్యూనిటీ హాళ్లకు రూ.40 లక్షల ఎంపీ నిధులు



ఎంపీ బాలశౌరి నుంచి నిధుల మంజూరు పత్రాన్ని అందుకుంటున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: నియోజకవర్గంలోని ఎస్సీ కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధికి ఎంపీ నిధుల నుంచి రూ.40 లక్షలు మంజూరయ్యాయని పామర్రు శాసనసభ్యుడు కైలే అనిల్‌కుమార్ కార్యాలయ సిబ్బంది శనివారం తెలిపారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఢిల్లీలో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరిని కొన్ని అభివృద్ధి పనుల నిమిత్తం కలిశారని పేర్కొన్నారు. అనంతరం పామర్రులోని ఎస్సీ కమ్యూనిటీ హాల్(అంబేడ్కర్ భవనం)కు రూ.30 లక్షలు, మొవ్వ మండలం కోసూరు ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు రూ.10 లక్షలు మొత్తం రూ.40 లక్షలను ఎంపీ నిధుల నుంచి మంజూరు చేశారని తెలిపారు. మంజూరు చేసిన నిధుల సమాచార పత్రాన్ని ఎంపీ బాలశౌరి పామర్రు శాసన సభ్యుడు కైలే అనిల్‌కుమార్‌కు అందజేశారని పేర్కొన్నారు.

విద్యార్థులు రూపొందించిన కళాకృతులు



గుడివాడ గ్రంథాలయంలో పేపర్‌తో చేసిన వాటిని ప్రదర్శిస్తున్న చిన్నారులు



జమీగొల్వేపల్లిలో తయారు చేసిన కళాకృతులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గుడివాడటౌన్: స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు హస్తకళలపై శిక్షణ ఇచ్చారు. క్రాఫ్ట్ టీచర్ ఎస్‌కే సుభాని, ఎస్.శిరీష ఆధ్వర్యంలో చిన్నారులకు పేపర్ ద్వారా అనేక రకాల వస్తువులు, డిజైన్లు తయారు చేయడంలో శిక్షణ ఇచ్చారు. ఇది చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్‌కే సుభాని అన్నారు.

జమీగొల్వేపల్లి(పామర్రు): విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తే ఎన్నో నూతన ఆవిష్కరణలకు కారణభూతమవుతాయని మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లిలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులలోని మేధా శక్తిని ఉపయోగించి ఎన్నో కొత్త కొత్త రూపాలను తయారు చేయిస్తున్నామని అన్నారు. ఆలోచనా శక్తికి పదును పెట్టి దాని ద్వారా మరెన్నో నూతన కళలను ఆవిష్కరించవచ్చునని అన్నారు. అనంతరం విద్యార్థులు పేపరు సహాయంతో తయారు చేసిన క్రాఫ్ట్ కళాకృతులు, వివిధ పద్ధతుల ద్వారా తయారు చేసిన కళాకృతులను ప్రదర్శించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్, విద్యార్థులు పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పామర్రులో... గణితం అంటే భయం వదిలి ఆసక్తి పెంచుకోవాలని గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీ రాణి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో గణిత ఉపాధ్యాయురాలు ఎం.అనూరాధ విద్యార్థులకు గణితంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బిజినెస్ గేమ్స్ ఆడించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రమాబాయి సహకారంతోనే అంబేడ్కర్ రాజ్యాంగం

మండవల్లి: మండవల్లి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో శనివారం విశ్వమాత రమాబాయి 88వ వర్ధంతి కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి షేక్ పర్వీన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి ఎల్ఎస్ భాస్కరరావు మాట్లాడుతూ విశ్వమాత రమాబాయి అంబేడ్కర్ సహకారంతోనే భారతదేశానికి అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించగలిగారని వివరించారు. రమాబాయి చిత్రపటానికి బ్యాచిలర్ ఇన్ లైబ్రరీ సైన్స్ విద్యార్థిని మాతంగి సుష్మసరోజ, గ్రంథాలయాధికారి పర్వీన, బేతపూడి కుసుమ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉత్సాహంగా టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్



దొడ్డిపట్లలో ఉత్కంఠగా సాగుతున్న బూమ్‌ర్రా, డీఎస్పీ జట్ల మధ్య క్రికెట్ పోటీ

కైకలూరు: వేసవి సెలవుల నేపథ్యంలో దొడ్డిపట్ల ప్రీమియర్ లీగ్ (డీపీఎల్) పేరుతో దొడ్డిపట్ల జెడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 25 నుంచి ప్రారంభమైన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. దాదాపు 26 జట్లు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి పోటీ పడుతున్నాయి. మూడో రోజు శనివారం బూమ్‌ర్రా ఎలెవెన్స్, డీఎస్పీ ఎలెవెన్స్ మధ్య ఎనిమిది ఓవర్లకు పోటీ జరిగింది. మొదటి బ్యాటింగ్ చేసిన కుప్పనపూడి బూమ్‌ర్రా జట్టు 10 వికెట్ల నష్టానికి 51 పరుగులు సాధించింది. ఆకివీడు డీఎస్పీ జట్టు నాలుగు వికెట్ల నష్టానికి 52 పరుగులు సాధించి విజేతగా నిలిచింది. తర్వాత ఉండి సాయిరామ్ ఎలెవెన్స్ జట్టు 5 వికెట్ల నష్టానికి 67 పరుగులు సాధించింది. తర్వాత బ్యాటింగ్ చేసిన కలిదిండి మండలం బరింకలగరువు ఎలెవెన్స్ జట్టు 8 వికెట్ల నష్టానికి 39 పరుగులు మాత్రమే సాధించి పరాజయం పాలైంది. అంపైర్లుగా నాగరాజు, సుబ్రహ్మణ్యం వ్యవహరించారు. నిర్వాహకులుగా ఫణీంద్ర, రాజు, వీరాంజనేయులు, జీవన్‌బాబు, మణి, జితేంద్ర, నాగబాబు, సురేష్ వ్యవహరిచారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి



సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఎంహెచ్ఓ గీతాబాయి

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి. గీతాబాయి అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. వీరికి సర్టిఫికెట్లను డీఎంహెచ్ఓ అందజేసి మాట్లాడారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను జిల్లాలో 356 మందిని నియమించారని, వీరిని 40 మంది బ్యాచ్‌లుగా విడగొట్టి వారం రోజులు శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల్లో వీరికి విధులు కేటాయించి ప్రాథమిక చికిత్స చేసేలా శిక్షణ ఇస్తున్నామని వివరించారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకుల ద్వారా వీరికి శిక్షణ ఇచ్చామని తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ డీపీఎంఓ డాక్టర్ సి. సుదర్శన్‌బాబు, డాక్టర్ సాయికిరణ్, నోడల్ అధికారులు శ్రీనివాసరావు, ఖుద్దూస్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు సత్వరమే పూర్తిచేయాలి

ముదినేపల్లి రూరల్ : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు సత్వరమే పూర్తి చేయాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని కొరగుంటపాలెం, అన్నవరం, గురజ జగనన్న కాలనీల్లో శనివారం వారు పర్యటించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ ప్రభుత్వం సబ్సిడీ ధరలపై అందిస్తోందన్నారు. జాప్యం లేకుండా బిల్లులు మంజూరు చేస్తోందని తెలిపారు. కాలనీలో విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వంటి సౌకర్యాలను యుద్ధప్రాతిపదికన కల్పిస్తూ లబ్ధిదారులకు అసౌకర్యం లేకుండా చేస్తున్నట్లు చెప్పారు. బ్యాంకు ద్వారా పావలా వడ్డీకే రూ.30 వేల రుణం అందిస్తున్నట్లు తెలిపారు.

హౌసింగ్ లేఅవుట్ పరిశీలించిన ఎంపీడీఓ



మండవల్లి: మండలంలోని ప్రత్తిపాడు గ్రామంలో హౌసింగ్ లేఅవుట్‌ను ఇన్‌చార్జి ఎంపీడీఓ బి.ఆనందబాబు శనివారం సందర్శించారు. లబ్ధిదారులు, తదితర విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు నీటి సరఫరా నిలిపివేత

గుడివాడటౌన్: పురపాలక సంఘ పరిధిలోని 1, 2, 3, 7, 9, 10, 11, 36 వార్డుల్లో సోమవారం మంచినీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీచర్స్ కాలనీ రిజర్వాయర్‌కు, టిడ్కో గృహాలకు మంచినీటి సరఫరా నిమిత్తం అరవపేట వద్ద ఇంటర్ కనెక్షన్ పనులు నిర్వహిస్తున్న నేపథ్యంలో గౌతమ్ స్కూల్, లింగవరం రోడ్, నాగవరప్పాడు, వైఎస్సార్ కాలనీ, వాసవి నగర్, కొత్తపేట, కుమ్మర చెరువు, వలివర్తిపాడు రోడ్డు తదితర ప్రాంతాలకు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

స్వామి వారికి వెండి వస్తువుల సమర్పణ



మోపిదేవి: మోపిదేవిలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి స్థానిక భక్తులు విస్సంశెట్టి శ్రీధర్ కుమారుడు మోహన వెంకట సాయికృష్ణ రూ. 70 వేలు విలువగల వెండి వస్తువులను బహూకరించారు. శనివారం ఉదయం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్న ఆయన ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు వెండి పళ్లెం, శఠారి, ఏక హారతి అందించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. దాతలను సన్మానించారు.

రుణాల యాప్ వేధింపుల నుంచి రక్షణ కల్పించాలి

దిశ పోలీసులకు బాధిత మహిళ ఫిర్యాదు

గుడివాడరూరల్: రుణాల యాప్ బాధితుల వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని గుడివాడ పట్టణంలోని దనియాలపేటకు చెందిన ఓ మహిళ శుక్రవారం రాత్రి దిశ పోలీసులను ఆశ్రయించింది. వివరాల్లోకి వెళితే పట్టణంలోని దనియాలపేటలో నివాసం ఉండే ఓ మహిళ మైలోన్ రుణాల యాప్ నుంచి ఈనెల 13వ తేదీన రూ.7,500 అవసరమైన రుణం తీసుకుంది. వారం రోజుల వ్యవధిలో ఈనెల 19వ తేదీన తీసుకున్న రుణాన్ని వడ్డీతో సహా మొత్తం చెల్లించింది. రెండు రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు వివిధ నంబర్ల నుంచి ఆమెకు ఫోన్‌కాల్స్ చేసి అదనంగా డబ్బులు కట్టాలని వేధిస్తున్నారు. అసభ్య పదజాలంతో మాట్లాడుతూ మహిళను వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ విషయమై సదరు మహిళ రుణాల ఆగంతకుల నుంచి రక్షణ కల్పించాలని గుడివాడ వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు ఆగంతకుల ఆచూకీ కనిపెట్టే పనిలో ఉన్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఆన్‌లైన్ యాప్ మోజులో పడవద్దని రుణాలు తీసుకుని ఇబ్బందులకు గురికావద్దని పోలీసులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు.

పారిశుధ్య నిర్వహణపై తగు చర్యలు

జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర నాయక్



కాలనీలో మురుగు నిల్వలను పరిశీలిస్తున్న డీపీఓ నాగేశ్వర నాయక్

పామర్రు(పమిడిముక్కల): గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొనకుండా పారిశుధ్య నిర్వహణపై తగు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర నాయక్ అన్నారు. పమిడిముక్కల మండలం వీరంకిలాకు గ్రామంలోని ఎన్టీఆర్ కాలనీలో మురుగు నీటి నిల్వలను శనివారం స్థానిక అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీరంకిలాకు గ్రామంలోని ఎన్టీఆర్ కాలనీలో గుడి వెనుక భాగాన ఉన్న వారు తమకు మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసనతో కూడి ఉంటోందని, అంతేకాకుండా దోమలకు ఆలవాలంగా మారి దోమల బెడద ఎక్కువగా ఉంటోందని స్పందనలో జిల్లా కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారన్నారు. ఈ ఫిర్యాదు మేరకు ఆయా ప్రాంతాల్లో పరిశీలనలు జరిపామని చెప్పారు. స్థానికంగా ఉన్న వారి పశువుల చావిడి నిర్వహణ ద్వారా వచ్చే వ్యర్థాల మురుగు నీటిని పక్కనే ఉన్న డ్రైనేజీలలోకి వదిలిన కారణంగా ఈ పరిస్థితి ఏర్పడుతోందని గ్రహించామని అన్నారు. ఇకపై పశువుల వ్యర్థాలను డ్రైనేజీలోకి వదలవద్దని ఆదేశించామన్నారు. స్థానికంగా ఉన్న డ్రెయిన్‌లోని మురుగు నీరు నిల్వ ఉండకుండా దిగువకు ప్రవహించేలా తగు చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించామన్నారు. మురుగు నీటి నిల్వల వలన అనారోగ్య పరిస్థితులు ఏర్పడే ప్రమాదాలు ఉన్నాయన్నారు. ఆయా ప్రాంతాల్లో బ్లీచింగ్ తదితరాలను చల్లించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ సంపత్‌కుమారి, ఈవోపీఆర్డీ విజయ్‌కుమార్, కార్యదర్శి రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి



పెరికెగూడెంలో పంటబోదె పనులు నిర్వహిస్తున్న ఉపాధి కూలీలు



పంటబోదె పూడిక తీత పనులను చేస్తున్న ఉపాధి కూలీలు

మండవల్లి: ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఏపీఓ ఎన్.నవీన్ అన్నారు. మండలంలోని పెరికెగూడెం గ్రామంలో రూ.1,27,277తో చేపట్టిన పంటబోదె పనుల్లో శనివారం 68 మంది కూలీలు పాల్గొన్నట్లు తెలిపారు. ఉపాధి పనుల ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని, తాగు, సాగునీటి సమస్యలు తీరుతున్నాయని అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌లు పాల్గొన్నారు.

ప్రమాణాలను పాటిస్తూ ఉపాధి పనులు

పామర్రు: నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉపాధి హామీ పనులు నిర్వహించాలని పామర్రు ఏపీవో పోలు రాజు అన్నారు. మండలంలోని పోలవరం, రాపర్ల, ఉండ్రపూడి, దగ్గుమిల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కచ్చితమైన కొలతలతో నాణ్యతా ప్రమాణాలతో పనులు చేయాలని అన్నారు. ఎటువంటి అవకతవకలకు తావులేకుండా పనులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో 5320 మంది ఉపాధి హామీ కూలీలతో పనులు నిర్వహించామని అన్నారు. చెరువు గట్ల అభివృద్ధి పనులు, పంట బోదెలో పూడిక తీత పనులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డు అసిస్టెంట్‌లు, మేట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు చేయూతగా రుణాలు



జగనన్న గ్రీన్ విలేజ్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: జగనన్న గ్రీన్ విలేజ్‌లో గృహ నిర్మాణ లబ్ధిదారులకు కేడీసీసీ బ్యాంకు ద్వారా రూ.2 లక్షల రుణం అందిస్తామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. గ్రీన్ విలేజ్‌లో లబ్ధిదారులతో ఆయన శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్లాబ్ నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులు కేడీసీసీ బ్యాంకు అందించే తక్కువ వడ్డీ రుణం ద్వారా ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం కైకలూరు నుంచి వచ్చిన గ్రామ ప్రముఖుల బృందం తక్కువ ఖర్చుతో నూతన టెక్నాలజీతో ఆర్త సంస్థ నిర్మిస్తున్న గృహాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, హౌసింగ్ ఏఈ వీవీఎస్ శేఖర్, బ్యాంకు అధికారులు, లబ్ధిదారులు, సచివాలయం సహాయకులు, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మంచినీటి పథకం బరంతు పనులకు శ్రీకారం

కైకలూరు: రక్షిత మంచినీటి పథక లోతట్టు ప్రాంత పూడిక పనులను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చిన్న చెరువు గట్టు సమీపంలో శనివారం ప్రారంభించారు. ఇక్కడ స్కీం వద్ద 10 సెంట్లు భూమి లోతట్టులో ఉండటం వల్ల మురికినీరు నిలుస్తోంది. దీంతో మెరక పనులను చేయిస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. చిన్న చెరువు ఆధునికీకరణ పనులను వేగవంతంగా చేస్తున్నామన్నారు. చక్కటి పార్కును నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, వార్డు సభ్యుడు తోట మహేష్, నాయకులు నిమ్మల సాయి, మురాల వెంకటేశ్వరరావు, కృష్ణ, నాగ మహాలక్ష్మి, పడమటి సీతారామాంజనేయులు, పిచ్చికల నాగరాజు పాల్గొన్నారు.

నేడు దత్తాత్రేయస్వామికి మల్లెల అర్చన

మండవల్లి: మండలంలోని లోకుమూడి దత్తాశ్రమంలో గణపతి సచ్చిదానందస్వామీజీ 81వ జన్మదినోత్సవాల్లో భాగంగా 28వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి అనఘాదేవి సమేత దత్తాత్రేయ స్వామికి మల్లెల అర్చన నిర్వహించనున్నట్లు ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గురజాడ ఉదయ్‌శంకర్ శనివారం అన్నారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వినియోగం జరుగుతుందన్నారు. భక్తులంతా పాల్గొనాలని ఆయన కోరారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

కైకలూరు:విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం కై కలూరు, కలిదిండి మండల గ్రామాల్లో సోమవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని గుడివాడ విద్యుత్‌శాఖ ఇంజినీరు టి.రామకృష్ణ చెప్పారు. ముదినేపల్లి మండలం చిగురుకోట 132/33 సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేయనున్నామని పేర్కొన్నారు. కలిదిండి, పోతుమర్రు, కోరుకొల్లు, మూలలంక, వరహాపట్నం, పల్లెవాడ సబ్‌స్టేషన్ల పరిధి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

CHANGE OF NAME

I **Garbhani Jaya Lakshmi** W/o. Kuchipudi Ratnakar Hence Forth be know as **Garbhani Jayalakshmi** for the purpose of Correction of wrong entries like as Kuchipudi Jayasree occurred in my son passport **Record No. Z2778486** Name Kuchipudi Vinay Kumar. Due to Clearical Mistakes. So kindly consider my name as **GARBHANI JAYA LAKSHMI** instead of Kuchipudi Jaya Sree in my Sons passport.

